
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శుక్రవారం 20 సెప్టెంబరు 2024





రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు కాలిపోయి సుమారు రెండు నెలలు కావస్తోంది. అయితే ఇంతవరకు ఫైళ్లు కాల్చడం వెనుక కారణాలు నిర్దిష్టంగా బయటకు రాలేదు. సంఘటన జరిగిన మరుసటి రోజే పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఇప్పటికీ ఆ విచారణ విషయాలు బయటకు రాకపోయినా అదిగో తోక.. ఇదిగో పులి అన్నట్లు పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. 22ఏ ఫైళ్లలో అక్రమాలు జరిగాయని, ఫ్రీహోల్డ్ ఫైళ్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందని, అసైన్‌మెంట్ ఫైళ్లు, భూసేకరణలో వైసీపీ పాలనలో అనేక పాపాలు జరిగాయని, ఇలా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే ఈ కేసు విషయమై సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే పలువురు సిబ్బందిపై, ఇద్దరు ఆర్డీవోలపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీ నాయకులు కొందరిపైనా కేసులు నమోదు చేశారు. ఇదే సమయంలో ఏపీ సీఐడీకీ ఈ కేసును ప్రభుత్వం అప్పగించింది. సీఐడీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఫైళ్లు ఎందుకు కాల్చారు? ఎవరు కాల్చారు? అనే చర్చ సర్వత్రా నడుస్తోంది.

అందుకే కాల్చేశారా..?

- ఇంకా విచారణలోనే మదనపల్లె ఫైల్స్ దహనం కేసు
- ఫ్రీహోల్డ్ పాపాలా? భూసేకరణ అక్రమాలా?
- సీఐడీ విచారణలో బయటపడేనా?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూలై 21వ తేదీ రాత్రి 11.30 గంటలకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు కీలక ఫైళ్లు కాలిపోయాయి. తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ఫైళ్లు కాలిపోయాయని అందరూ అనుకున్నారు. మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ ఉన్నతాధికారులకు అదేవిధంగా సమాచారం ఇచ్చారు. అయితే మరుసటి రోజు సంఘటనా స్థలానికి డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఏపీ సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో పాటు కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పలువురు ఉన్నతాధికారులు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తర్వాత ప్రాథమిక అంచనాకు వచ్చిన ఉన్నతాధికారులు ఇది ప్రమాదం కాదని, ఉద్దేశ్యపూర్వకంగానే ఎవరో కీలక ఫైళ్లు కాల్చారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సంఘటనా స్థలంలో ఉన్న సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్‌తో పాటు గతంలో పనిచేసిన ఆర్డీవో మురళిలను సైతం విచారించి కేసులు నమోదు చేశారు. ఫైళ్ల దహనం చాలా చిన్న విషయమని రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఇష్యూ చేస్తోందని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డిలు వ్యాఖ్యానించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అప్పటి అధికార పార్టీ నాయకుల కోసం అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ బయటపడతాయనే ఫైళ్లను కాల్చివేసినట్లు పలువురు పేర్కొంటున్నారు.

ఆ ఫైళ్లే కారణమా?

ఫైళ్లు కాల్చివేయడానికి కూడా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. సీఐడీ విచారణలో ఫైళ్ల కాల్చివేత వెనుక వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల నుంచి రెవెన్యూలో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా రన్నింగ్ ఫైళ్లతో పాటు.. 22ఏ ఫైళ్లు, ఫ్రీహోల్డ్ ఫైళ్లు, భూసేకరణ ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయంలో ఉంటాయి. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయంలోనూ ఉంటాయి. అయితే సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని కొందరు సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిన ఫైళ్లలో సమాచారాన్ని మార్చి కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. ఇంతే కాకుండా పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల సంతకాలు కూడా ఫోర్జరీ చేసిన విషయం బయటపడ్డట్లు సమాచారం. ఇంకా కొన్ని ఫైళ్లకు ఆర్డీవోల సంతకాలే ఫోర్జరీ చేసినట్లు తెలిసింది. దీని వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, బినామీలు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని కొందరు సిబ్బంది బరి తెగించి అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు 22ఏ ఫైళ్లలో తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సమాచారానికి.. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన ఫైళ్లలో సమాచారానికి తేడా ఉన్నట్లు గుర్తించారు.

ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు కుప్పలుతెప్పలు

డీకేటీ భూములు 20 సంవత్సరాలు అనుభవంలో ఉన్న లబ్ధిదారుల పేరిట రెగ్యులర్ చేసేందుకు జగన్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని అప్పటి వైసీపీ నాయకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనలతో సంబంధం లేకుండా వైసీపీ నాయకులు చెప్పినట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్షా 42 వేల ఎకరాలను ఫ్రీహోల్డ్ కింద చేశారు. ఇందులో ఇప్పటికి సుమారు 4800 ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇందులో సుమారు 45 శాతం వరకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు సీఐడీ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఫ్రీహోల్డ్ అయిన వ్యక్తులు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇతరులు రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. అసైన్‌మెంటు పొందిన వ్యక్తులు అనుభవంలో లేకున్నా రికార్డులు వాళ్ల పేరు మీద లేకున్నా ఫ్రీహోల్డ్ చేసినట్లు తెలిసింది.



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన ఫైళ్లు (ఫైల్)

భూసేకరణలోనూ గోల్‌మాల్

ఫ్రీహోల్డ్, 22ఏ ఫైళ్లతో పాటు గత ప్రభుత్వ కాలంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాల భూసేకరణలోనూ అప్పటి అధికార పార్టీ నాయకులు గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తెలిసింది. మదనపల్లె మండలం తట్టివారిపల్లె నుంచి పీలేరు వరకు జాతీయ రహదారి-71 పనులు 53 కిలోమీటర్ల పొడవునా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పట్టణ శివారులోని అన్నమయ్య సర్కిల్ వరకు ఉన్న బైపాస్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. తట్టివారిపల్లె జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు సంబంధించి భూసేకరణలో కొందరు వైసీపీ ముఖ్య నాయకులు నష్టపరిహారం పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం సేకరించే భూముల్లో పట్టా భూములతో పాటు డీకేటీ భూములకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. ఇందులోనే అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. డీకేటీ పట్టా లేకపోయినా ఆన్‌లైన్‌లో ఉందని, డి-పట్టా ఆన్‌లైన్‌లో లేకపోయినా అనుభవం పేరుతో నష్టపరిహారం కాజేసినట్లు తెలిసింది. ఇలా నష్టపరిహారం కాజేయడంలో వైసీపీ నాయకులతో పాటు కొందరు అధికారులు కూడా సందట్లో సడేమియా లాగా తప్పుడు పత్రాలతో నష్టపరిహారం కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా కురబలకోట మండలంలో ముదివేడు వద్ద రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. భూనిర్వాసితులకు పైసా నష్టపరిహారం ఇవ్వలేదు. ఈ పనులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ ముదివేడు రిజర్వాయర్ నిర్మాణంలోనూ, భూసేకరణలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఉండడంతో తమకేమీ ఇబ్బంది ఉండదని అధికారులు, వైసీపీ నాయకులు అనుకున్నారు. అయితే ప్రభుత్వం మారిపోవడంతో అక్రమాలు వెలుగులోకి వస్తాయని అటు అధికారులు, ఇటు వైసీపీకి చెందిన నాయకులు భయపడిపోయారు. తమ అక్రమాలకు సాక్ష్యంగా ఉన్న రికార్డులు కాల్చేస్తేనే గట్టున పడతామని భావించారు. ఫలితమే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను కాల్చివేయడం. ఈ నేపథ్యంలో ఈ ఫైళ్ల దహనం వెనుక ఉన్న అసలైన కారణాలను సీఐడీ పోలీసులు నిగ్గు తేల్చుతారని పలువురు పేర్కొంటున్నారు.




జ్యోతి బస్టాండులో గట్టు వైపు బస్సు కోసం వేచి వున్న విద్యార్థులు

ఈ అగచాట్లు ఇంకెన్నాళ్లు..!

- బి.కొత్తకోటకు రాకపోకలకు విద్యార్థుల అవస్థలు
- రద్దీ సమయంలో బస్సులు నడపని ఆర్టీసీ అధికారులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 19: తమ గ్రామాల నుంచి చదువుకోవడానికి విద్యార్థులు, వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు నిత్యం బి.కొత్తకోటకు వచ్చి తిరిగి స్వగ్రామాలకు వెళ్లడం నిత్యకృత్యం. అయితే అందుకు తగ్గ రవాణా సౌకర్యం లేక ఉద్యోగులు, విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. బస్సులు వచ్చిన సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. పట్టణంలో జూనియర్, డిగ్రీ కాలేజీలు, ప్రైవేట్ స్కూళ్లు ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ వందలమంది విద్యార్థులు పీటీఎం, ములకలచెరువు మండలాల్లోని కందుకూరు, కాట్నగల్లు, బూర్లపల్లె, తుమ్మరకుంట, మద్దినాయునిపల్లె, రామానాయునికోట తదితర గ్రామాల నుంచి బి.కొత్తకోటకు వస్తారు. అదేవిధంగా చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు మదనపల్లె పట్టణం నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులూ వస్తారు. అయితే రాకపోకలకు వీరు రోజూ పడే అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. గతంలో ఇక్కడ ఉన్న ఆర్టీసీ డిపో రద్దు కావడంతో మదనపల్లె డిపో నుంచి అరకొరగా సర్వీసులు నడుస్తున్నాయి. రద్దీ సమయంలో అధికారులు తగినన్ని సర్వీసులు నడపడం లేదు. దీంతో బస్సులో సీటు కోసం, లేదంటే కనీసం చోటుకోసం వీరితో పాటు ఆ సమయంలో బస్సు ఎక్కాల్సిన ప్రయాణికులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. మరీ ముఖ్యంగా అమ్మాయిల బాధలు వర్ణనాతీతంగా మారాయి. బస్సు ఎక్కే క్రమంలో అమ్మాయిలు ఆత్మగౌరవాన్ని పక్కన పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. అబ్బాయిలైతే సర్కస్ ఫీట్లు చేస్తుండటం కనిపిస్తోంది. ఉన్న అరకొర బస్సులను మెయింటెయిన్ చేసే ఆర్టీసీ అధికారి కూడా బి.కొత్తకోటలో లేకపోవడం అధికారుల ఉదాసీనతను చాటుతోంది. ఈ అవస్థలు ఇంకెన్నాళ్లు? అని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్సులను మరిన్ని పెంచాలని కోరుతున్నారు.



పీటీఎం మండలం వైపు గ్రామాలకు వెళ్లేందుకు బస్సు కోసం విద్యార్థులు ఎదురుచూపు

రాజంపేట టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఘర్షణ
- రెండు గంటల పాటు ఇరువర్గాల బైఠాయింపు
- పోలీసుల రంగప్రవేశం

రాజంపేట, సెప్టెంబరు 19: రాజంపేటలో టీడీపీ నేతల మధ్య ఉన్న విబేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గురువారం సాయంత్రం అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ విభేదాలు వీధికెక్కాయి. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ప్రారంభానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. అధికారులు కూటమి నాయకులకు ఆహ్వానాలు పంపారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు సుగవాసి బాలసుబ్రమణ్యం అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యారు. అయితే ఆ సమయానికి కత్తెర కనిపించలేదు. ఇంతలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు కత్తెర తీసుకుని రిబ్బన్ కత్తిరించడానికి ప్రయత్నించగా సుగవాసి బాలసుబ్రమణ్యం అడ్డుకున్నారు. దీంతో సుగవాసి వేలికి స్వల్పగాయం అయింది. అప్పటికే ఇరు వర్గాల వారు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం, జగన్‌మోహన్‌రాజు వర్గీయులు వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకున్నారు. రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడికి ప్రాధాన్యత తగ్గించి ఎలా అన్నక్యాంటీన్ ప్రారంభిస్తారని జగన్‌మోహన్‌రాజు వర్గీయులు వాదనకు దిగారు. పార్లమెంట్‌కు అధ్యక్షుడిగా ఉన్న జగన్‌మోహన్‌రాజు అన్ని నియోజకవర్గాల్లో తిరగకుండా కేవలం రాజంపేటలోనే తిష్టవేసి ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని సుగవాసి వర్గీయులు ప్రతివాదనకు దిగారు. ఉద్రిక్తత మధ్య అన్న క్యాంటీన్‌ను ప్రారంభించినా పేదలకు భోజనం వడ్డించే విషయంలో తిరిగి వివాదం రేగింది. తాను టీడీపీ నియోజకవర్గ బాధ్యుడినని, పేద ప్రజలకు భోజనం పెట్టే విషయంలో వివాదం జరగడం దారుణమని సుగవాసి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మొదట తానే వడ్డించాలని, తర్వాత ఎవరు వడ్డించుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు.

విషయం తెలుసుకున్న రాజంపేట డీఎస్పీ సుధాకర్, రాజంపేట, రైల్వేకోడూరుకు చెందిన సీఐలు, అనేక మంది ఎస్ఐలు అక్కడకు చేరుకుని సుమారు రెండుగంటల పాటు ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ఈ సమస్యను కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. సుగవాసి బాలసుబ్రమణ్యం సోదరుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో రాయచోటి నుంచి భారీఎత్తున తన అనుచరులను వాహనాలలో అన్న క్యాంటీన్ వద్దకు తీసుకురావడానికి ప్రయత్నించారు. వీరిని పోలీసులు ముందస్తుగా సానిపాయ వద్దనే అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పి ఆయనను తిరిగి రాయచోటికి పంపించివేశా రు. సుగవాసి బాలసుబ్రమణ్యం చేత మొదటగా అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనాలు వడ్డించారు. ఆయనను భారీ పోలీసు బందోబస్తు మధ్య రాయచోటికి తరలించారు. తదనంతరం జగన్‌మోహన్‌రాజు చేత అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించడంతో ఉద్రిక్తతకు తెరపడింది.

పట్టణంలో పోలీసులు ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి టీడీపీ నాయకులను, కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేయడంతో పరిస్థితి సుఖాంతమైంది. ఏది ఏమైనా అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధిష్టానం జోక్యం చేసుకుని నియోజకవర్గ ఇన్‌చార్జిని స్పష్టంగా ప్రకటించాలని, నాయకత్వ బాధ్యతలు ఒక్కరికే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

రాయచోటిలో ఉద్రిక్తత

రాజంపేట పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా గురువారం సాయంత్రం నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో గురువారం రాత్రి రాయచోటి పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. సుగవాసి పాలకొండ్రాయుడు వర్గీయులు వందల సంఖ్యలో బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబుల కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు కార్యకర్తలతో మాట్లాడుతూ జరిగిన సంఘటన మొత్తం అధిష్ఠానం దృష్టిలో ఉందని, కార్యకర్తలు ఎవరూ ఆవేశపడవద్దని సముదాయించి పంపించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో వందలాది మందితో రాయచోటిలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న సుగవాసి బాల సుబ్రమణ్యం



అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం భోజనం వడ్డిస్తున్న జగన్‌మోహన్ రాజు

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వడిత్యా శంకర్ నాయక్

పీలేరు/రాయచోటి టౌన్, సెప్టెంబరు 19: గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యతనిచ్చి ప్రణాళికలు అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన పీలేరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో ఎస్టీ రిజర్వేషన్ అమలు తీరుతెన్నులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో గిరిజనులకు విధిగా 6 శాతం కేటాయించాలని, ఆ మేరకు అన్ని పథకాల్లో వారికి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. అంతకు మునుపు ఆయన కోటపల్లెలోని కేవీపల్లె గిరిజన బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులం అద్దె భవనంలో నడుస్తోందని, తమకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవని ఈ సందర్భంగా విద్యార్థినులు ఆయన దృష్టికి తేవడంతో వెంటనే ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆ తరువాత ఇటీవల మరణించిన గూడరేవుపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లెకు చెందిన బంజారా సంఘ నాయకుడు గూండాల నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి తేజస్విని, తహసీల్దారు భీమేశ్వర రావు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సతీశ్, ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ, తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర నాయక్, ఏవో రమాదేవి, ఏపీవో మహేశ్, ఏపీఎం లక్ష్మణరెడ్డి, ఆర్టీసీ సీఐ సుబ్బమ్మ, ఎస్ఐ బాలకృష్ణ, ఏడీసీ నరసింహారెడ్డి, ఏఈలు యతిరాజులు, నాగరాజు నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట సమీపంలో గల గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా పుస్తకాలను పరిశీలించి బాలికల చేత చదివించి సబ్జెక్టులో వారికి ఉన్న పట్టుపై ఆరా తీశారు. సబ్జెక్టు టీచర్లు సెలవుపై వెళ్లడమే కాకుండా ఫ్యాన్లు, లైట్లు సక్రమంగా లేకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో అన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. అనంతరం భోజనం, కూరలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. బాలికలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాబోవు పబ్లిక్ పరీక్షల్లో గిరిజన బాలికల పాఠశాల నుంచి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎంఈవో-2 వెంకటశివారెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆశలన్నీ లోకేశ్‌పైనే..

- మదనపల్లెలో యువగళం 500 కి.మీ.పాదముద్ర
- టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్‌స్టోరేజికి లోకేశ్ హామీ
- నేడు బంగారుపాళెంలో తొలి హామీ అమలు
- లోకేశ్ హామీపై టమోటా రైతుల ఆశలు



యువగళం పాదయాత్ర సందర్భంగా సీటీఎం క్రాస్ వద్ద 500 కిలోమీటర్ల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు ముందు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు యువగళం పేరిట పాదయాత్ర చేసిన అప్పటి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నేటి మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ హామీలను నెరవేరుస్తామని మాట ఇచ్చిన లోకేశ్ నేడు చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో తొలి హామీ నెరవేర్చేందుకు తొలి అడుగు వేస్తున్నారు. బంగారుపాళెంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించేందుకు వస్తున్న లోకేశ్ 100 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర శిలాఫలకం వద్ద అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో యువగళం పాదయాత్ర 500 కిలోమీటర్లు దాటిన సందర్భంగా లోకేశ్ ఆవిష్కరించిన శిలాఫలకంలోని హామీలపై టమోటా రైతులు గంపెడాశతో ఉన్నారు.

25 ఏళ్లుగా ఎదురుచూపు

జిల్లాలోని పడమటి ప్రాంతంలో వర్షాభావంతో ఆరుతడి పంటల సాగును వదిలేసిన రైతులు, వాణిజ్య పంట అయిన టమోటా వైపే మొగ్గు చూపుతున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా రైతులు టమోటా సాగు చేస్తున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 45 వేల హెక్టార్లకు పైగా టమోటా సాగవుతోంది. టమోటా సాగుకు ఎకరాకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్న రైతులు పెట్టుబడి రావాలంటే టమోటా కిలో సరాసరిన రూ.15 ధర పలకాల్సి ఉంది. ఎకరాకు వెయ్యి క్రేట్లు (క్రేట్ 25 కిలోలు) పంట దిగుబడి వస్తే రైతులకు పెట్టుబడి తిరిగి వస్తుంది. ఈ ధరలు తగ్గిపోయినా, దిగుబడి తగ్గినా రైతులు నష్టాలు ఎదుర్కోవాలి. ఇదిలా ఉంటే టమోటా ధరలు ఒక్కోసారి కిలో రూ.10 నుంచి రూ.2 వరకు ధరలు విపరీతంగా పడిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులకు ఆదుకునేందుకు మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ ఏర్పాటు తప్పనిసరి. 25 ఏళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నా టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌పై హామీలు ఇస్తున్నారే కానీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ క్రమంలో గత ఏడాది నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మార్చి 10వ తేదీ మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద 500 కిలోమీటర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా సీటీఎం క్రాస్ వద్ద నారా లోకేశ్ 500 కిలోమీటర్ల శిలాఫలకం ఆవిష్కరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లెలో టమోటా రైతులకు ఉపయోగపడే విధంగా టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్‌స్టోరేజ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు బంగారుపాళెంలో నారా లోకేశ్ తొలి హామీ అమలులోకి తీసుకొస్తున్న దరిమిలా, మదనపల్లెలో కూడా నారా లోకేశ్ హామీ నెరవేరుస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

లోకేశ్ హామీపై కొండంత ఆశ..



ప్రతి సంవత్సరం విడవకుండా టమోటా సాగు చేస్తున్నా. ఒకటి రెండు సార్లు తప్ప, అన్ని సార్లు రేట్లు లేక నష్టపోయి అప్పుల మీద పడుతున్నాయి. మదనపల్లెలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పెడితే ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు కొంటుంది. లాభాల సంగతి దేవుడెరుకు అసలు వచ్చినా చాలు. ఇప్పుడు మంత్రిగా లోకేశ్ అధికారంలో ఉన్నారు. ఆయన తలచుకుంటే తప్పకుండా ఇక్కడ టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ వచ్చేస్తుంది.

- సిద్దయ్య, టమోటా రైతు, నల్లగుట్టపల్లె, మదనపల్లె మండలం

హామీ తప్పకుండా నెరవేరుస్తామన్నారు..



సీటీఎంలో 500 కిలోమీటర్ల శిలఫలకం ఆవిష్కరించి ఇచ్చిన హామీపై మంత్రి లోకేశ్ స్పష్టంగా ఉన్నారు. రెండు రోజుల క్రితం ఈ విషయమై ఉండవల్లిలో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాము. ఆయన తప్పకుండా హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తామని చెప్పారు. మరో వంద రోజుల్లో మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన జరిగి టమోటా రైతుల కష్టాలు తీరడం ఖాయం.

- దేవరింటి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు, మదనపల్లె

ప్రణాళికాబద్ధమైన చదువులతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: ప్రపంచస్థాయిలో నడవాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి తెలిపారు. యూఎ స్ఏ, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నత చదువులు, ప్లేస్‌మెంటు అవకాశాలపై గురువారం వైవీయూలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ సమాజం నీ కోసం ఎదురు చూస్తుందని విద్యార్థి దశలో జ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ఆంగ్లంలో సంభాషించేవారిని, చదువుతున్న కోర్సుల్లో మార్కుల పరంగా ప్రతిభచూపిన వారికి విదేశాల్లో విద్య ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో వ్యవస్థాపకుడు కె.రామారావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పై చదువులకు, పీజీ విద్యార్థులు పరిశోధనలకు, ఉద్యోగావకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారికి ఆర్‌డీఎల్ టెక్నాలజీ సంస్థ ఉచితంగా సహాయపడుతుందన్నారు. విదేశాల్లో టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో సీటు పొందే విధానం.. అందుకు గల అర్హతలు, పాస్‌పోర్టు పొందే విధానం గురించి అవగాహన కల్పించారు. ప్లేస్‌మెంటు సెల్ డైరెక్టరు ప్రొఫెసరు ఎన్‌వీ రెడ్డి, సైకాలజీ సహాచార్యులు డాక్టర్ లాజర్ పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించి ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరు ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ విడుదల చేశారు. గురువారం పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరులో 90 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని.. అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్షల విభాగాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రరెడ్డి, ఉదయ ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంబేపల్లె, సెప్టెంబరు19: మండల పరిధిలోని కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లా రాజా (24) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఎర్రబెల్లి రోడ్డు దేవపట్లకు చెందిన చల్లా రాజా వడ్డెర వృత్తి పనిలో భాగంగా సమీపంలోని కొండకు వెళ్లి బండ్రాళ్లు కొట్టి ఇంటికి తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కొడుకు, భార్య కలరు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

విద్యుదాఘాతంతో బోదకొట్టం దగ్ధం

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని ముదిరెడ్డిపల్లె తాండాలో నివాసముంటున్న మూడే సుబ్బమ్మకు చెందిన బోదకొట్టం గురువారం విద్యుదాఘాతంతో కాలిబూడిదైంది. వివరాలిలా.. సుబ్బమ్మ ప్రతి రోజూ పొలాల్లో కూలి పనికి వెళ్తుండేది. ఈమె భర్త కొన్నేళ్ల కిందట మరణించాడు. పిల్లలు వివాహమై వేరు కాపురం ఉండడంతో ఈమె ఒక్కటే నివాసం ఉంటోంది. ఈ క్రమంలో రోజులాగే కూలి పనికి వెళ్లింది. కాగా ఇంట్లోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈఘటన జరిగింది. దీంతో ఇంట్లోని సామాన్లు, దుస్తులు, బియ్యం మూటలు, కొంతమేర నగదు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని.. బాధితురాలు కన్నీరుమున్నీరై విలపించింది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, సెప్టెంబరు 19: కడప నగరం నాగరాజుపేటలో ఉన్న ఇంటర్ కాలేజ్‌లో చదువుతున్న ఓ ఇంటర్ విద్యార్థి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కడపకు చెందిన యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కాలేజికి వెళ్లిన విద్యార్థి 11.30 గంటలకు కళాశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం వద్దకు వెళ్లి తలకు రాసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు, అధ్యాపకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అయితే విద్యార్థి ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియడం లేదు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం సెప్టెంబరు 19: గత ప్రభుత్వం 2022లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేసి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి.. ఎంపికలు జరపలేదని, వాటిని భర్తీ చేయడంతో పాటు పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఓయువకుడు మనస్థాపం చెంది ఈనెల 17న ప్రభుత్వ ఆర్ట్స్‌కాలేజి మైదానం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం యువకుడిని రిమ్స్‌కు తరలించారు. వివరాలిలా.. పాత కడపకు చెందిన ప్రదీప్ 2022 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యగ నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించి తరువాత పరీక్షలకు సిద్ధమవుతన్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా ఎంపికలను నిలిపివేశారు. తరువాత ఎంపికలు జరగలేదని, ప్రస్తుతం ఆ ఎంపికలు జరుపుతారో లేదోనని మనస్థాపంచెంది విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తన తండ్రి ఐదేళ్ల క్రితం చనిపోవడంతో పోలీస్ ఉద్యోగంపై ఆశలు పెట్టుకున్నానని.. ప్రభుత్వం స్పందించి 2022 ఎంపికలను కొనసాగించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో... ఒకరికి జైలు శిక్ష

కడప (క్రైం), సెప్టెంబరు 19 : మద్యం సేవించి బైకు నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలుశిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరి తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ నెల 17న కడపకు చెందిన రమేశ్‌రెడ్డి మద్యం సేవించి బైకు నడుపుతుండగా.. తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదుచేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచడంతో న్యాయాధికారి విచారించి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

నెల్లూరులో రైల్వేకోడూరు వాసి మృతి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 19: నెల్లూరులో రైల్వేకోడూరు వాసి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. రైల్వేకోడూరు పోలీసుల వివరాల మేరకు...రైల్వేకోడూరు మండలానికి చెందిన మామిడి వెంకటయ్య (50) ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించారు. తర్వాత వెంకటయ్య నెల్లూరు జిల్లా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం వద్ద కొన్ని రోజుల పాటు కాలం గడిపాడు. కాగా, ఈనెల 14న వెంకటయ్య అపస్మారకస్థితి చేరుకున్నాడు. దీంతో అక్కడి భక్తులు 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందాడు. రైల్వేకోడూరు పోలీసులు నెల్లూరుకు వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు.

కుమార్తె కనిపించలేదని తండ్రి ఫిర్యాదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19: త న కుమార్తె కనబడడంలేదని చల్లా అంజయ్య అనే వ్యక్తి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పోరుమామిళ్ల మండలంలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చల్లా అంజయ్య పెద్దకుమార్తె అంజలి(14) 17వ తేదీ రాత్రి ఇంటి వద్దనే నిద్రపోయిందని, మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా కనబడలేదు. చుట్టుపక్కల వెతికినీ ఆచూకీ తెలియకపోవడంతో 19వ తేదీ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.10 నాణెం వద్దే వద్దు

- నోట్ల కొరత.. నాణేలే దిక్కు
- అయినా తిరస్కరిస్తున్న వ్యాపారులు
- పెట్రోలు బంకుల్లోనూ అంతే
- ఆర్‌బీఐ సూచనలు బేఖాతరు



పులివెందుల టౌన్, సెప్టెంబరు 19 : ఓ పక్క పదిరూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా నాణేలు తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ.. చివరికి పెట్రోలు బంకుల్లో సైతం ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. పది రూపాయల నోట్ల స్థానంలో ఐదేళ్ల క్రితం పది నాణేలను ఆర్‌బీఐ అందుబాటులోకి తెచ్చింది. కొంత కాలం ఈ నాణేలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్ల నుంచి దుకాణదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తూ వచ్చారు. పై నాణేలు వినియోగంలోనే ఉన్నాయంటూ ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు వాటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఇటీవల పది రూపాయల నోట్ల కొరత వచ్చింది. ఇందుకు ప్రత్యామ్నాయమైన పది నాణెం చెలామణి అవుతుందని చెబుతున్నా కొంత మంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు.

2019లో ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన పది రూపాయల నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో నాలుగు రకాలుగా విడుదల చేశారు. పది రూపాయల నోటు ఎక్కువ కాలం నాణ్యత, మన్నికగా ఉండదు. దీంతో సుమారు 20ఏళ్ల పాటు చెలామణిలో మన్నికగా ఉండేలా ఆర్‌బీఐ పది రూపాయల నాణేన్ని అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత పది రూపాయల నాణెం విలువైనది.

ఇప్పటికీ ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా చెలామణిలో ఉన్నా మన ప్రాంతంలో అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు, చెన్నై, మహానగరాల్లో ఆ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. ఇక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని పులివెందులలో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

పులివెందులలో నోట్ల కొరత ఎక్కువగా ఉంది. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం ఆర్‌బీఐ మరోసారి పది రూపాయల నాణేల వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. వీటిని తిరస్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయినా దుకాణ యజమానుల్లో మార్పు రాలేదు. దీనికి తోడు పెట్రోలు బంకుల్లో సైతం ఈ నాణేలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

తీసుకోకపోతే.. కేసు నమోదు

పది నాణెం చెలామణిలో ఉందని... అన్ని చోట్ల అది చెల్లుబాటు అవుతుందని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. పది నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా బ్యాంకర్లు బాధ్యతగా తీసుకుని పది నాణెంపై ప్రచారం నిర్వహిస్తే వాటి చెలామణి పెరుగుతుంది. వ్యాపారులతో సత్సంబంధాలు కలిగిన జీఎస్టీ అధికారులు కూడా వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాగా, పులివెందుల పట్టణంలో మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో కొందరు వాహనదారులు రూ.10 నాణేలను ఇవ్వగా.. అక్కడ సిబ్బంది తిరస్కరించడంతో వారితో వాగ్వివాదానికి దిగారు. చిన్నవ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోలు బంకుల్లో సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని.. వాటిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

పది రూపాయల నాణెం ఎక్కడైనా చెల్లుతుంది.

పది రూపాయల నాణెం తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాలలో చలామణిలో ఉంది. ఏపీలో ముఖ్యంగా కడప జిల్లా పులివెందులలో చెలామణిలో లేదు. బ్యాంకుల్లో వాటిని మార్చుకోవచ్చు. డిపాజిట్ చేయవచ్చు. ఈనాణేన్ని తిరస్కరించే బ్యాంకర్లపై ఫిర్యాదు చేయవచ్చు, వ్యాపారులు ఇతరులకు ఈ నాణెంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- జనార్ధనరావు, ఎల్‌డీఎం

వివేకానందుని బాటలో యువత నడవాలి

- స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 19: స్వామి వివేకానందుని అడుగుజాడలలో నడిచి యువత సన్మార్గం వైపు పయనించాలని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ అన్నారు. వివేకానందుని జయంతి సందర్భంగా స్టెప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 230 మంది హాజరయ్యారు. కాగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాయిగ్రేస్ మాట్లాడుతూ యువతకు ఆదర్శప్రాయుడుగా ఖ్యాతిగాంచిన స్వామి వివేకానందుడి జయంతిని పురష్కరించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో యువజనోత్సవాలు జరుగనున్నాయన్నారు. ప్రధానంగా యువతకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనాలన్నారు. డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాధకుమార్ మాట్లాడుతూ సమాజంలో మంచి కన్నా చెడు ఎక్కువగా ప్రభావం చూపుతుందని, యువత మంచి మార్గంలో పయనించి తల్లిదండ్రులకు, సమాజానికి పేరు తీసుకురావాలన్నారు. అప్పుడే సమాజ వికాసం కాగలదన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.బ్రహ్మయ్య, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ, స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, కళాశాల, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టెప్ సీఈవో సాయిగ్రేస్



జానపద కళా నృత్యాలు వేస్తున్న యువతులు

విజేతలకు బహుమతులు

యువజనోత్సవాలలో భాగంగా జానపద, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, కవిత్వం, డిక్లమేషన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో పోయెట్రీ విభాగంలో బి.దస్తగిరి ప్రథమ విజేతగా, ఎస్.సురేఖ ద్వితీయ విజేతగా నిలిచారు. డిక్లమేషన్ విభాగంలో ప్రథమ విజేతగా ఎస్. సమీనా, ద్వితీయ విజేతగా ఎస్.ఏ.అహ్మద్, స్టోరీ రైటింగ్ విభాగంలో ప్రథమ విజేతగా ఎస్.సానియా, ద్వితీయ విజేతగా ఎస్.జెబా, పెయింటింగ్ విభాగంలో ప్రథమ విజేతగా హరినాయక్, ద్వితీయ విజేతగా టి.చంద్రభాను నిలిచారు. ఫోక్ డాన్స్ (గ్రూప్) ప్రథమ విజేతగా పి.యస్విత, ద్వితీయ విజేతగా జయచంద్ర, ఫోక్ డ్యాన్స్ (సోలో) ప్రథమ విజేతగా ఎన్.ఉషోదయ, ద్వితీయ విజేతగా టి.సుదేష్ణ, ఫోక్ సాంగ్ (సోలో) ప్రథమ విజేతగా కె.మురళిమోహన్, ద్వితీయ విజేతగా డి.అనుష, ఫోక్ సాంగ్ (గ్రూప్) ప్రథమ విజేతగా ఎం.గణేష్ నిలవడంతో బహుమతులు అందజేశారు.

మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 19: మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ బదిలీల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వున్న సీనియర్ అసిస్టెంట్ గంగాదేవి శ్రీకాళహస్తికి బదిలీ కాగా.. ఎర్రగుంట్లలో వున్న సీనియర్ అసిస్టెంట్ గంగిరెడ్డి ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరులో జూనియర్ అకౌంటెంట్‌గా వున్న కె.బాల వెంకటసుబ్రమణ్యం స్వామి, సీనియర్ అకౌంటెంట్ జి.ప్రవీణ్‌కుమార్‌లు మైదుకూరుకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో సీనియర్ అకౌంటెంట్ ఐజయ్య జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు రానున్నారు. జూనియర్ అకౌంటెంట్ మాత్రం ఎవ్వరూ రాలేదు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు కె.విజయ, స్వర్ణలత ఎర్రగుంట్లకు, బి.వెంకట సుబ్బారెడ్డి పులివెందులకు, వి.వెంకట కిరణ్‌కుమార్ జమ్మలమడుగుకు, బి.రామలక్షుమ్మ రాయచోటికి, శ్రీనివాసులరెడ్డి బద్వేల్‌కు, ఎం.రమేష్ పులివెందులకు బదిలీ అయ్యారు. ఎర్రగుంట్ల నుంచి బి.లక్ష్మీనారాయణ, పులివెందుల నుంచి షేక్ షఫివుల్లా, జమ్మలమడుగు నుంచి కె.స్వర్ణలత, బద్వేలు నుంచి హిమబిందు ప్రొద్దుటూరుకు జూనియర్ అసిస్టెంట్లుగా రానున్నారు. అయితే వీరిలో షఫీవుల్లాను ప్రొద్దుటూరుకు బదిలీ చేసినా.. డిప్యూటేషన్‌పై కమలాపురం వేశారు. దీంతో ఇక్కడ వున్న ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వెళితే.. ఇక్కడికి ముగ్గురు మాత్రమే జూనియర్ అసిస్టెంట్లుగా బదిలీపై రానున్నారు. అలాగే జూనియర్ అకౌంటెంట్ సుబ్రమణ్యం స్థానంలో ఎవ్వరిని వేయలేదు. దీంతో ఇక్కడ జూనియర్ అకౌంటెంట్ పోస్టు ఖాళీగా వుంది. ఇంత పెద్దమున్సిపాలిటీలో ఒక్క జూనియర్ అకౌంటెంట్ లేని పరిస్థితి నెలకొంది. కేవలం ఒక్క సీనియర్ అకౌంటెంట్‌తో నడపాలంటే కష్టమౌతుందని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మైలవరానికి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, సెప్టెంబరు 19: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 7,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 19 : జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) స్టేడియంలో ఈనెల 21వ తేదీ శనివారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కడప మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో ఆర్డినేటర్ ఎస్.సాజీత్ వెల్లడించారు. ఇందులో 14 నుంచి 17 సంవత్సరాల బాల, బాలికలు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 21న చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 23వ తేదీ సోమవారం బ్యాడ్మింటన్ (షటిల్), వాలీబాల్ పోటీలు జరుగనున్నట్లు స్పష్టం చేశారు. 24న నగర మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు, 25న అదే పాఠశాలలో ఖో..ఖో పోటీలు జరుగనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల స్థాయి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక బుకింగ్ మరింత సులభతరం

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్) సెప్టంబరు 19: నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇసుక సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాండిల్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ శ్రీధర్ చామ కూరి పేర్కొన్నారు. గురువారం అమరావతి నుంచి నూతన ఇసుక పాలసీ ప్రకారం ఉచితంగా ఇసుకను పొందేందుకు రాష్ట్ర గనులశాఖ, భూగర్భశాఖ వారు రూపొందించిన ఏపీ శాండిల్ పోర్టల్‌ను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా నుంచి కలెక్టర్, డీఆర్‌ఓ హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు ఉచిత ఇసుక ఇవ్వడమే కాకుండా, వారు కోరుకుంటే అ ఇసుకను ఇంటికి చేర్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇందుకోసం కేవలం రవాణా చార్జీలు చెల్లించాల్సి వుంటుందన్నారు. గనులశాఖ అధికారి రవిప్రసాద్, ఆర్‌టీఓ భరత్ చౌహాన్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు టెక్స్‌టైల్ పార్కులోని ప్లాట్లకు లాటరీ

మైలవరం, సెప్టెంబరు 19: మైలవరం టెక్స్‌టైల్ పార్కులో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా లాటరీ తీసి ప్లాట్లను కేటాయిస్తారని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి నాగరాజారావు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కులో మొత్తం 118 ప్లాట్లు ఉండగా.. 79 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. ఒక్కో ప్లాటుకు రూ.50వేల చొప్పున 79 మంది లబ్ధిదారులు చెల్లించారన్నారు. హ్యాండ్‌లూమ్, పవర్‌లూం, డ్రాయింగ్ తదితర యూనిట్లకు ప్లాట్లు లాటరీ ద్వారా కేటాయించడం జరుగుతుందన్నారు.మిగిలిన ప్లాట్లకు లబ్ధిదారులు రూ.50 వేల చొప్పున చెల్లిస్తే వారికి లాటరీ ద్వారా త్వరలోనే కేటాయిస్తామని.. చేనేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖాధికారి నాగరాజారావు తెలిపారు.

మూడు నెలల పసి కందును దాచేసిన తండ్రి

కడప (క్రైం), సెప్టెంబరు 19: మూడు నెలల పసి కందును ఓ తండ్రి దాచేసిన సంఘటన కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వల్లూరుకు చెందిన మణికంఠ, వీరపునాయునిపల్లెకు చెందిన మౌనికకు ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఈ ఏడాది జూన్ 13న ఆడబిడ్డ జన్మించింది. వీరిద్దరూ కడప బాలాజీ నగర్‌లోని మణికంఠ స్నేహితుడి ఇంట్లో ఉంటున్నారు. కాగా మణికంఠ మరుసటి రోజు ఆ పసికందును మౌనికకు తెలియకుండా ఇందిరానగర్‌లోని బంధువుల సంరక్షణలో ఉంచాడు. భార్య నిలదీయడంతో డాక్టర్ వద్ద పాపను చూపిస్తున్నానని చెప్పాడు. అందుకు సందేహించిన భార్య గట్టిగా నిలదీసింది. మణికంఠ సరిగా స్పందించకపోవడంతో తాలూకా సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసింది. దీంతో మణికంఠను విచారించగా.. తమది ఒకే గోత్రం కావడంతో పాపను బంధువులకు అప్పగించానని తెలిపాడు. సీఐ ఆ పాపను తెప్పించి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. భార్యా భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆ చిన్నారిని తల్లికి అప్పగించారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారిస్తున్నారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప (మారుతీనగర్) సెప్టెంబర్ 19: ఆర్టీసీ బస్సుల ప్రయాణంలో ప్రయాణీకులకు వుండే అనుమానాలను, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈనెల 21వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం తలపెట్టినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణీకులు తమ సమస్యలను, సందేహాలను, సూచనలను 9959225848 నెంబర్‌కు ఫోన్ చేసి కానీ వాట్సాప్ ద్వారా తెలియపరచాలని కోరారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సామాజిక న్యాయ సాధకుడు చంద్రబాబు


- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాదిగ



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప (మారుతీనగర్), సెప్టెంబర్ 19: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సామాజిక న్యాయం సాధ్యం కాగలదని ఆంధ్రప్రదేశ్ మాది గ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు అండగా వుండడమే కాకుండా.. గతంలో ఎన్నడూ లేని విధంగా మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞత తెలిపేలా గత ఆగస్టు 16న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞతయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద గల దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ కులంలోని ప్రధాన మాల, మాదిగలతో పాటు మిగతా ఉప కులాలు కూడా సమాజంలో పురోగతి సాధించేందుకు వీలుగా ఎస్సీ వర్గీకరణ అమ లు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ గత ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మన దేశ సామాజిక ఉద్యమాల చరిత్రలోనే గొప్ప తీర్పు అన్నారు. ఈ తీర్పు వెలువడిన వెంటనే అమలు చేస్తామని మాదిగలకు భరోసా ఇచ్చిన దార్శనికుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివకుమార్, నాయకులు కె.బాబు, జి.గురవయ్య, సంజీవ్, వి.నారాయణ, రాములయ్య, జి.శ్రీనివాసులు, సి.నాగార్జున, ఎస్.ఓబులేసు తదితర నాయకులు పాల్గొన్నారు.

హైవే పనులు పూర్తి అయ్యేదెన్నడో



లక్కిరెడ్డిపలె సెప్టంబరు19: చాగలమర్రి నుంచి మదనపల్లెకు 2022లో నేషనల్ హైవే నాలుగు లేన్ల రోడ్డు మంజూరైంది. ఏడాది పాటు వేంపల్లె నుంచి రాయచోటి వరకు ఒక పక్క పనులు శర వేగంగా పనులు ప్రారంభించారు. అదే ఊపులో పనులు జరిగిఉంటే ఈపాటికి పనులు పూర్తయి రాకపోకలకు ఇబ్బందులుండేవి కావు. 2023 నుంచి మూకుమ్మడిగా పనులు సాగాయి. అక్కడక్కడా కల్వర్టుల ఏర్పాటుకు రోడ్డును అడ్డంగా తవ్విపెట్టారు. రాయచోటి-వేంపల్లె రహదారిలో దాదాపు 15పైగా కల్వర్టులున్నాయి. ఏ ఒక్క కల్వర్టు కూడా పూర్తి కాలేదు అన్ని కల్వర్టుల్లో గుంతలుతీసి కడ్డీలు అమర్చి వదిలేశారు. కల్వర్టులున్న చోట వర్షం కురిస్తే మోకాలు లోతు నీరు చేరి ద్విచక్రవాహనాలు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాయచోటి వేంపల్లె గంటన్నర ప్రయాణమైతే ఈ రోడ్డు మార్గాన వెళ్లాలంటే 3 గంటలు సమయం పడుతోందని ప్రజలు వాపోతున్నారు. బస్సులో ప్రయాణం చేసేవారి పరిస్థితి ఇలా ఉంటే ద్విచక్రవాహనంలో వెళ్లేవారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ మూడేళ్లలో ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు సుమారు 10 మంది పైగా మృత్యువాత పడ్డారు. అందులో 20 నుంచి 30 ఏళ్లున్న యువకులే ఎక్కువ. చాగలమర్రి-రాయచోటి రహదారి సుమారు రూ.100 కోట్లతో పనులు మొదలు పెట్టారు. రహదారి కోసం భూములు కొనుగోలు చేశారు. లక్కిరెడ్డిపల్లె, చింతకుంటపల్లె, కోనంపేట, బండపల్లె, గొల్లపల్లె, రాయచోటి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా స్థలాలు, ఇళ్లు స్థలాలకు డబ్బు చెల్లించారు. తరువాత రోడ్డుపనుల్లో అలసత్వం జరుగుతోంది. లక్కిరెడ్డిపల్లె- రాయచోటి మధ్య ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఇక వేంపల్లె, పాయలోపల్లె, చక్రాయపేట, ప్రాంతాల్లో కూడా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఏళ్ల తరబడి నేషనల్ హైవేపనులు ఇలా నిలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. రాత్రి వేళ ఈ రోడ్డు మార్గాన వెళ్లాలంటే కచ్చితంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాలని వాహనదారులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు ఆగిపోయాయని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. పనులు ప్రారంభించకపోతే మరెన్నో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి కాకాణికి లేదు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 19: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించే స్థాయి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి లేదని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులెల రమేష్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన పనులను కాకాణి విమర్శించడం సరి కాదన్నారు. కాకాణి తన ఉనికిని కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం పైన బురదజల్లే మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని, దాన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెమటోడ్చుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా 1న పింఛన్ డబ్బు ప్రజలకు అందిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ. 1000 పెంచడానికి ఐదేళ్ల కాలం పట్టిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, అన్నా క్యాంటిన్లు పునఃప్రారంభిస్తున్నారన్నారు. విజయవాడ వరదల నుంచి నేటి వరకు చేస్తున్న పనులు చంద్రబాబును చూసి నేర్చుకోవాలన్నారు. ఆయన ఆలోచనలు, ప్రణాళికలు హర్షించాల్సింది పోయి విమర్శలు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక కాకాని గోవర్ధన్‌రెడ్డి చేతగాని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు శ్రీధర్‌నాయుడు, ఈశ్వరయ్య, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన బాధితుల వినతులు


బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

నందలూరు, సెప్టెంబరు 19: అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి వరద బాధితుల వినతులు వెల్లువెత్తాయి. ప్రాజెక్టు ముంపునకు గురై ఆస్తి, పశునష్టం వాటిల్లిన బాధితుల నుంచి గురువారం షాదీఖానాలో రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి వినతులు స్వీకరించారు. పాటూరు సచివాలయం, అరవపల్లె షాదీఖానా, లేబాక సచివాలయంలో తహసీల్దార్ అమర్‌నాథ్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి దగ్గరుండి వరద సమయంలో ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకుని నష్టపోయినవారికి తగిన న్యాయం జరగాలని సబ్‌కలెక్టర్, అధికారులను కోరారు. తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, పాటూరు మోహన్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. తమ బాధలను తెలపడానికి బాధితులు భారీగా తరలివచ్చారు.

బ్యాంక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, సెప్టెంబరు19: బ్యాంక్ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయు లు కోరారు. షికారుపాలెం పాఠశాలలో గురువారం జరిగిన తాటిగుండ్లపల్లి గ్రామ సమాఖ్య-1 కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని సురక్షా బీమా, జీవ నజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సంవృద్ధి పథకం, అన్నిరకాల ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై స్వల్ప వడ్డీతో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయన్నారు. స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాల్లో మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నా రు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత అందరూ పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఒక మొక్క నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. రాయచోటి ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి, ఏపీఎం ఖాదర్‌వలి, కోఆర్డినేటర్ చంద్ర, సీసీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు'

సుండుపల్లి, సెప్టెంబరు 19: ప్రభుత్వా న్ని విమర్శించడం సరికాదని జనసేన మండల నేత రామా శ్రీనివాసులు తెలి పారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళుల ర్పించిన ఆయన పాత్రికేయులతో మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై ఓ వైసీపీ నేత విమర్శ లు చేయడం సిగ్గు చేటన్నారు. సీఎం పాలనపై రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో మండలంలో మైనార్టీలపై జరిగిన దాడులను, భూ ఆక్రమణలను ఏరోజైనా ప్రశ్నించారా అని విమర్శించారు. మైనార్టీ మండల నేతలు మేకల మహబూబ్ బాషా, టీడీపీ నేతలు వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు ఎర్రం రెడ్డి, మాజీ ఎంపీటీసీ నంద్యాల రామయ్య తదితరులు పాల్గొనారు.

రాజకీయ వేధింపులు ఆపాలని ధర్నా

రాయచోటిటౌన్, సెప్టెంబరు19: రాజకీయ కారణాలతో, అకారణంగా తొలగించిన అంగన్వాడీ వర్కర్ జానకిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం అంగన్వాడీ వర్కర్ జానకిని రాజకీయ వేధింపులతో తొలగించడాన్ని నిరసిస్తూ ప్రాజెక్టులోని వర్కర్లు రాయచోటిలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల ముందు కూటమి నేతలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి నేడు అధికారంలోకి రాగానే ఉద్యోగులను తొలగిస్తూ జగన్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను మార్చడం రాజకీయ కారణాలతో తొలగించిన జానకిని విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పరిసరాల శుభ్రతే ప్రధానం

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవ చేయాలి ● ప్రతిజ్ఞ చేసిన అధికారులు, విద్యార్థులు


రామాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు - లక్కిరెడ్డిపల్లెలో విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది మానవహారం - రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 19: పరిసరాల శుభ్రతే ప్రధానమని ఈఓపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బొమ్మవరం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన స్వచ్ఛ తా హి సేవలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు మండల అధికారులు, ఉపాధ్యాయులు లక్ష్యాలు, ఉద్దేశ్యాలపై ఈఓపీఆర్డీ ప్రధానోపాధ్యాయులు వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం గ్రామంలో పరిసరాలు పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, స్థానిక టీడీపీ నేతలు చెంగల్‌రాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేసిన అధికారులు

రామాపురం, సెప్టెంబరు19: స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం మండల అధికారి టీం స్వచ్ఛ మండలం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ రామాంజులు మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ స్వాతంత్రంతో పాటు అభివృద్ధి స్వచ్ఛమైన దేశం కోసం ఆకాంక్షించారు. ఆయన ఆశయ సాధనలో మనవంతుగా ఇంటి, పరిసరాలు, వీధిని, మన గ్రామాన్ని, మన మండలాన్ని శుభ్రంగా ఉంచుకోవడం కోసం ప్రతిన బూనుదామన్నారు. వారానికి రెండు గంటలు, ఏడాదికి వంద రోజులు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం కేటాయిద్దామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు. ఈఓపీఆర్డీ ఉషారాణి, ఎంఈఓ రామకృష్ణుడు, ఏపీఓ పెంచలయ్య, వెలుగు ఏపీఎం దేవయాని, ఆర్ఐ రవికుమార్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు19: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవలో పాల్గొనాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, తహసీలారు లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మానవహారంగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, ఈఓపీఆర్డీ పట్నాయక్, అధ్యాపకులు క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, డీటీ రాఘవేంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పరిశుభ్రత

చిన్నమండెం, సెప్టెంబరు19: స్వచ్ఛతా హి సేవలో భాగంగా దేవగుడిపల్లి పంచాయతీలోని దేవగుడి కస్పా నుంచి కుర్వపల్లి వెళ్లే దారిని సెక్రటరీ సుమిత్రమ్మ పరిశుభ్రంగా చేయించారు. ఎంపీడీఓ దివ్య అధ్యక్షతన మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పోషకాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం గురించి తెలియజేస్తున్న పద్మావతి

రామాపురం, సెప్టెంబరు19: మహిళలు, గర్భిణులు, పిల్లలు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా పోషక ఆహారం తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) పద్మావతి అన్నారు. గువ్వలచెరువు సెక్టారులోని గోపగుడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, బాలింతలు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క మహిళ ఆరోగ్యంగా ఉండాలని ఆమె తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, స్వచ్ఛభారత్ కింద చెట్లు నాటారు. గువ్వలచెరువు సెక్టారు సూపర్‌వైజర్ హుస్సేనమ్మ, పద్మజారాణి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, మహిళలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండడమే శ్రీరామరక్ష

చిన్నమండెం, సెప్టెంబరు19: మల్లూరు జడ్పీ హైస్కూల్‌లో బాల్యవివాహాలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు విద్యార్థులకు రీడ్స్ స్వచ్ఛంద సంస్థ అవగాహన చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డెన్న మాట్లాడుతూ బాలికలు సమాజం పట్ల అప్రమత్తంగా ఉండడమే శ్రీరామరక్ష అని వివరించారు. ఆకతాయిలు ఇబ్బంది కలిగిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని రీడ్స్ సంస్థ సభ్యులు రెడ్డెమ్మ, భారతి విద్యార్థులకు వివరించారు. ర్యాలీ నిర్వహించి బాల్యవివాహాలు, బాలకార్మికులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మానవహారమై నినాదాలు చేశారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

సంబేపల్లె, సెప్టెంబరు19: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌పీ అల్లావలి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో గురువారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం వల్ల హెచ్ఐవీకి గురికాకుండా చూసుకోవచ్చన్నారు. లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, సిరంజి, పరీక్షింపబడని రక్తం ద్వారా హెచ్ఐవీ ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఏఆర్‌టీ మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12 వరకు 200 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, మహిళలు, పొదుపు సంఘాలు, కార్మికులు, ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంటి వైద్యశిబిరం

రాజంపేట, సెప్టెంబరు 19: స్థానిక కాకతీయ కళాశాలలో శంకర నేత్రాలయం, పోలావారి కాకతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 10 రోజుల పాటు కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటిపొరను పరిశీలిస్తారన్నారు. 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకునే వారికి ఐఓఎల్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. బీపీ, సుగర్, ఇతర వ్యాధి గ్రస్తులు వాడే మందులు తీసుకురావాలన్నారు. ఎలాంటి కుట్లు లేకుండా నూతన పద్ధతిలో కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ చికిత్స పూర్తిగా ఉచితమన్నారు. చికిత్సకు వచ్చేవారు ఫోన్‌నంబరు, ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. రాజంపేట మాజీ సమితి అధ్యక్షుడు కీ.శే. పోలా వెంకటరెడ్డి శతజయంతి సందర్భంగా నిర్వహించే ఈ కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9885095019, 9440280290, 9848804567 సంప్రదించాలని కోరారు.

టీడీపీ పాలన వందరోజుల విజయోత్సవాలు


కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నియోజకవర్గ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి పేదలకు పంచిపెట్టారు. సుగవాసి బాలసుబ్రమణ్యంను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, రాజంపేట మండల మాజీ ఉపాధ్యక్షులు నాగా సుధాకర్ రెడ్డి, రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు, మండల టీడీపీ నేతలు మేకా నరసింహులు, నాగేశ్వర్ నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో....

రాయచోటిటౌన్, సెప్టెంబరు19: ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిస్తూ కూటమి ప్రజా ప్రభుత్వానికి వంద రోజులు పూర్తి అయ్యాయని స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి మండిపల్లి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు ఆలోచన, ఆచరణ భావితరాల భవిష్యత్తుకు పునాది లాంటిదన్నారు. ప్రజా పాలనకు వంద రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్రానికి తిరిగి ప్రాణం పోసిన నారా చంద్రబాబుకు, ప్రజలకు అందుబాటులో ఉంటున్న మంత్రి మండిపల్లికి జిల్లా ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్ విష్ణువర్ధన్‌రెడ్డి, గవర్నర్ ఫంక్షన్ ప్యాలెస్ జాఫర్ అలీఖాన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు సచివాలయంలో మంత్రి ప్రజా దర్బార్

చిన్నమండెం, సెప్టెంబరు19: సచివాలయం-1లో రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బారు నిర్వహిస్తారని ఎంపీడీఓ దివ్య పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సమస్యలు ఉండి మంత్రి దృష్టికి తీసుకురావాలనుకునేవారు ఉదయం 10 గంటలకు సచివాలయానికి చేరుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

వర్షం కోసం పూజలు


దండుమారెమ్మకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

సుండుపల్లి, సెప్టెంబరు 19: భాగంపల్లి పంచాయతీ కుంటలముంద దండుమారెమ్మ తల్లికి గ్రామస్తులు వర్షం కోసం జలాభిషేకం నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరాలు విరివిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండేవారు. ప్రస్తుతం వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరుణ దేవుడు కరుణించి వానలు కురవాలని ప్రార్థించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన పంతగాని


మంత్రి లోకేష్‌తో పంతగాని నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 19: మంత్రి నారా లోకేష్‌ను గురువారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ కలిశారు. వివిధ అంశాలపై మంత్రితో చర్చిస్తే ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

నేడు జాబ్‌మేళా

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 19: రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయరావు కోరారు. శుక్రవారం రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రైవేటు బ్యాంకులు, కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వరకు టెన్త్, అండర్ గ్రాడ్యుయేషన్ యువతీ యువకులు అర్హులన్నారు. రాష్ట్ర స్కిల్‌డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే మేళాలో ఉద్యోగాలు పొంది భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

గాలివీడు, సెప్టెంబరు19: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామక్రిష్ణ పేర్కొన్నారు. తలముడిపి పంచాయతీలోని పాపాఘ్ని నది నుంచి గాలివీడుకు ఎలాంటి అనుమతులు లేకుండా రసీదు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పసుపులవాండ్లపల్లె వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్, ఓనర్‌పైన కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

రాయచోటిటౌన్, సెప్టెంబరు19: కాంగ్రెస్ అగ్రనాయకుడు, పార్లమెంట్ సభ్యుడు రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ, శివసేన పార్టీ తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. రాహుల్‌పై శివసేన, బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలతో డీసీసీ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జిల్లా మహిళా అధ్యక్షురాలు గోశాలదేవితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సీపీఐ నేత విశ్వనాథనాయక్ మద్దతు తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ప్రణాళికలు రూపొందించండి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్) సెప్టంబరు 19: వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించేలా స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ అనంతరం ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య, విద్య, విధానంలో నైపుణ్యత అభివృద్ధి లక్ష్యలను చేరేలా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. అరటి, బొప్పాయి, మామిడి ప్రాసెసింగ్ ఏర్పాటు, మార్కెటింగ్ ప్రణాళికలు వుండాలన్నారు. డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, డీపీఓ ధనలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ మద్దిలేటి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్

రాయచోటిటౌన్, సెప్టెంబరు19: స్కౌట్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత భావం పెంపొందుతుందని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్స్ సహా అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్‌కు ప్రారంభ శిక్షణలో ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌లలో బాలురకు ఒక యూనిట్, బాలికలకు మరొక యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. బిగినర్స్ కోర్స్ శిక్షణ అనంతరం స్కౌట్స్, మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్ శిక్షణను ఇచ్చి వారికి సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు.

తప్పిపోయాడా..వదిలేశారా..?

● కొడుకులు ఉన్నా అనాథగా రామయ్య



నడవలేని స్థితిలో ఉన్న రామయ్య

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19: ఓ వృద్ధుడు నడవలేని స్థితిలో నిమ్మనపల్లి చేరడంతో అతను తప్పిపోయాడా? వదిలేశారా ? అనే అనుమానం కలుగుతోంది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి వెంకోజిగారిపల్లెలో బుధవారం రాత్రి ఒలిపి రామయ్య అనే వృద్ధుడు నడవలేని పరిస్థితిలో కనిపించాడు. అయితే రాత్రి స్థానికులు అన్నం పెట్టి ఉదయాన్నే రోడ్డు పక్కన వది లేశారు. అయితే అతని గురించి ఆరా తీయగా తన పేరు ఒలిపి రామయ్య అని తనది అనంపురం జిల్లా నల్లమా డ మండలం చెంద్రాయునిపల్లి గ్రామమని తెలిపాడు. కాగా తాను తిరుమల కొండకు గ్రామస్థులతో కలసి రాగా వారు తాను నడవలేనని తిరుమలలోనే వదివెళ్లార ని తెలిపాడు. తనకు ముగ్గురు కుమారులు వెంకటప్ప, రమణ, లక్ష్మణలు ఉన్నారని తన భార్య 9ఏళ్ల క్రితం మరణించినట్లు తెలిపాడు. అప్పటి నుంచి తిరుమలలో కోమటి వానిపత్రంలో రూ.5వేలకు వాచ్‌మెన్‌గా పని చేస్తుంటే తన నడిపి కుమారుడైన లక్ష్మణ తిరుమలకు వచ్చి తనను బాగా చూసుకోంటామని మాయమాటలు చెప్పి తాను దాచుకొన్న రూ.70వేలను తీసుకొని స్వగ్రామానికి తీసుకొచ్చి రోజుకు ఒక పూట మాత్రమే అన్నం పెట్టేవాడని తెలిపాడు. తనకు వృద్ధాప్య పంచన్ వస్తుందని దానిని కూడా తన వేలి ముద్ర వేసుకొని కొడుకులే తీసుకొనే వారని బోరున విలపించాడు. ప్రస్తుతం తాను ఎక్కడికి పోవాలో తెయడంలేదని ముగ్గురు కొడుకులు ఉండి కూడా అనాథనయ్యానని వాపోయాడు. రామయ్య దీనగాథ చూచినవారు మానవ విలువలు ఎంత దిగజారి పోయాయో అంటూ ముక్కున వేలేసుకున్నారు. ప్రస్తుతం రామయ్య ఓఇంటి వద్ద తలదాచుకొంటున్నాడు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

బి.కొత్తకోట, సెప్టెంబరు 19: బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని బాలసానిపల్లెలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బాబు(49) అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. అక్రమ మద్యంపై సమాచారంతో బాలసానిపల్లెకు వెళ్లి నిందితుడి వద్ద నుంచి 49 హైవార్డ్ చీప్‌విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

శివపురంలో బీఎస్ఎన్ఎల్ సేవలు

పెద్దమండ్యం, సెప్టెంబరు 19: పెద్దమండ్యం మండలం శివపురంలో బీఎస్ఎన్ఎల్ సేవలు గురువారం ప్రారంభమైనట్లు ఆ గ్రామ సర్పంచ్ గంగులమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శివపురం ప్రాంతంలో కొద్ది రోజుల క్రితం బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణం పూర్తైయింది. గురువారం బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19: జిల్లా ఫుట్‌బాల్ జట్టు(అండర్-17)కు ఎంపికైన బాల, బాలికలలు ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించే కోచింగ్ క్యాంపుకు హాజరు కావాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె మండలం శ్రీవద హైస్కూల్లో నిర్వహించనున్న కార్యక్రమానికి 21వ తేది సాయంత్రం 4గంటలకు బాలురు, 23వ తేది ఉదయం 10గంటలకు బాలికలు నాలుగు సెట్ల ఎలిజిబులిటి ఫారమ్స్, స్టడి సర్టిఫికేట్, మార్కుల లిస్టు, ఆధార్‌కార్డు తప్పక తీసుకురావాలని ఆమె కోరారు. ఐదు రోజుల శిక్షణ తరువాత బాల, బాలికల జట్లు పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన వలసి ఉందన్నారు. పూర్తి వివరాలకు 95020 74146 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు19: వెళుతున్న రైలు నుంచి పడి వ్యక్తి తీవ్రగాయాల పాలైన సంఘటన సీటీఎం వద్ద చోటుచేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన లారీ డ్రైవర్ సుబ్రమణి (40) తన సొంతపనులపై కదిరి రైలులో బయలుదేరిన ఆయన మార్గమధ్యంలో సీటీఎం అంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం రన్నింగ్‌లోని రైలు నుంచి జారీ పడిపోగా చికిత్స కోసం 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు పీలేరులో డయల్ యువర్ డీఎం

పీలేరు, సెప్టెంబరు 19: పీలేరు డిపో పరిధిలో ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజలు 9959225679 నెంబరకు ఫోను చేయాలని కోరారు.

సి.గొల్లపల్లి సమీపంలో పూర్తిగా ఎండిన వేరుశనగ పంట



పాపేపల్లి సమీపంలో ఎండిన పంటను వడిపిన రైతు రామచంద్ర



రైతన్నకు వేరుశనగ కష్టాలు..!

పెద్దమండ్యం, సెప్టెంబరు 19: ఖరీఫ్ వేరుశనగ పంటతో రైతన్న నిండామునిగాడు. పంటకు కాయలు ఏర్పడే సమయంలో వర్షాలు మొహం చాటేయడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. దీంతో చేసేదిలేక కొందరు రైతులు పంటను మధ్యలో వడిపివేశారు. పెద్దమండ్యం మండలం పాపేపల్లికు చెందిన రామచంద్ర అనే రైతు ఎండిపోయిన పంటను గురువారం వడుపుకున్నారు. ఎకరా వేరుశనగ పంట పూర్తిగా ఎండి పోయి చెట్టుకు రెండు మూడు కాయలు ఉన్నా అవికూడా నాణ్యతలేనికాయలు ఉండడంతో పంట చేతికి అందలేదు, కనీసం పశువులకు మేతైన మిగులుతుందోలేదో తెలియదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎండిపోయిన చెట్లును పెరకడంతో అవికూడ చేతికందక చేతులు బొబ్బలెక్కాయి. ఎకరానికి రూ. 35 వేలు ఖర్చు చేశారు. సాగు పెట్టుబడి కూడా చేతిరాదని రైతు వాపోయాడు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేసిన వేరుశనగ పంట పూత పిందె దిగుబడి సమయంలో వాన పడకపోవడంతో ఈ దుస్థితి వచ్చిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్‌లో మండలంలో 2వేల ఎకరా ల్లో వేరుశనగ పంట సాగు చేయగా మొదట్లో బాగా ఉన్న తర్వాత వర్షాలు లేకపోవడంతో రైతులు పంటపై ఆశలు వదులుకున్నారు. ఎండ వేడిమితాకిడికి ఖరీఫ్ వేరుశనగ చెట్లు పూర్తిగా ఎండిపోయి చెట్లు నల్లబారిపోయాయి. దీంతో పంట దిగుబడులు పూర్తిగా రాకుండా కనీసం చెట్లుకూడా పీకడానికి వీలు లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చేసేది లేక పంట పోయిన పశువులకు మేత కోసం ఎండిన వేరుశనగ పంటను కొంత మంది రైతులు వడుపుతున్నారు. దీంతో ఈ ఏడాది వేరుశనగ రైతుకు తీవ్ర కష్టం నష్టం మిగిల్చింది. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఖరీఫ్‌లో వేరుశనగ పంట దెబ్బతిన్న రైతులను అన్నివిధాల ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే పెద్దమండ్యం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రబీలోనైనా పంటల సాగుకు సహకరించాలని రైతన్నలు కోరుతున్నారు.

రూ.1.60లక్షలతో విద్యార్థులకు డైనింగ్ హాల్



పీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 19 : మండల కేంద్రమైన పీటీఎంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు పాఠశాల నిధులు రూ.1.60 లక్షలు వెచ్చించి డైనింగ్ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణాదేవిలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినాలంటే ఎండలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొని ఉండేదని స్పందించిన పాఠశాల యాజమాన్యం పాఠశాల నిధుల నుంచి రూ. 1.60 లక్షలతో నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఇందులో భాగంగా గురువారం డైనింగ్ హాల్‌ను ప్రాంభించేందుకు స్థానిక సప్తగిరి గ్రామీణా బ్యాంకు మేనేజర్ నాసీర్ ను ప్రత్యేకంగా ఆహ్వానించి డైనింగ్ హాల్‌ను ప్రారంబించారు. పాఠశాల నిధులతో డైనింగ్ హాల్ నిర్మించి పాఠశాల అభివృద్ధికి దోహద పడిన ఉపాధ్యాయ సిబ్బందికి ప్రధానోపాధ్యాయులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ నరసింహులుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19: మండలంలోని ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతి దండువారిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఎన్టీఆర్ గృహలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టిన వెంటనే సకాలంలోనే బిల్లులు మంజూరు అవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడు త్వరతిగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అమర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పురుశోత్తం పాల్గొన్నారు.

నేడు మదనపల్లెకు దత్త విజయానంద తీర్థ స్వామీజీ రాక



దత్త వియానంద స్వామీజీ రాక కోసం ఏర్పాట్లు సిద్ధం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: మండలంలోని పెంచపాడు రోడ్డులో ఉన్న దత్త ఆశ్రమానికి శుక్రవారం దత్త విజయానంద తీర్థస్వామి విచ్చేయనున్నట్లు దత్త ఆశ్రమం నిర్వహకులు వెంకటేశ్వర్లు స్వామి తెలిపారు. ఇందులో భాగంగా సకాలంలో వర్షాలు కురావాలని, సస్యశ్యామలంగా పాడిపంటలు పండాలని చక్రపూజ, చండీయాగం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్వామీజీ చేతులమీదుగా విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంచడానికి, జ్ఞాపకశక్తిని అభివృద్ధి పరచడానికి స్వయంగా విద్యార్థులకు భగవద్గీతా పుస్తకాన్ని 2వేలకు పైగా పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మదనపల్లె రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్, నారథరెడ్డి, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్లేడుతో గొంతు కోసుకున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు19: ఆరోగ్యం సహకరించక బ్లేడుతో గొంతు కోసుకుని చంద్రశేఖర్ (70) అనే వృద్ధుడు ఆత్మహత్యాయత్నానకి పాల్పడ్డాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు మండలంలోని బసినికొండ పంచాయతీలో ఉన్న చంద్రశేఖర్ ఆరోగ్యం సహకరించలేదని, కడుపు నొప్పి, షుగర్, ఉండి ఒంటరిగా ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించాడు. కాగా అతన్ని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పతికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

కురబలకోట, సెప్టెంబరు 19: వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బలకవారిపల్లెకు చెందిన కిరమున్నిషా(30) కడుపునొప్పి తాళలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అలాగే ముదివేడు పంచాయతీ కొంగావారిపల్లెకు చెందిన సుధాకర్ రెడ్డి(21) కుటుంబసభ్యులతో గొడపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానకి పాల్పడంతో గమనించిన కుటుంబీకులు 108 వాహనం సాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ముదివేడు పోలీసులు ఆసుపత్రికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

ములకలచెరువు, సెప్టెంబరు 19: మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తే ఆచార్యదేవోభవ పురస్కారాన్ని అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఇంగ్లీష్, హిందీ భోధించే ఉపాధ్యాయులు శామ్యూల్‌రాజ్, కమాల్‌బాషాలను ఘనంగా సన్మానించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 19 : మండల స్థాయిలో రెండు రోజుల క్రీడా పోటీలను పీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం ఎంపీడీవో కెఎస్ బాలాజీ, ఎంఈవో నారాయణ, హెచ్ఎం అపర్ణాదేవి ప్రారంబించారు. ఈ పోటీలకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా, తదితర క్రీడలను నిర్వహిస్తారు.

తంబళ్లపల్లెలో టీడీపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు

తంబళ్లపల్లె సెప్టెంబర్ 19 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తంబళ్లపల్లెలో గురువారం టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, సిద్దమ్మ ఆధ్వర్యంలో నాయకులంతా మండల కేంద్రంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి నేతృత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, తులసీదర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరి శ్రీనివాసులు, బీఎంఆర్ రెడ్డెప్ప, తెలుగు యువత నరసింహులు, గంగరాజు, గ్రామ ప్రధాన కార్యదర్శి శివకుమార్, పురుషోత్తం, సుధాకర్,, దనశేఖర్, వికలాంగ అధ్యక్షుడు రామాంజనేయులు, మల్లి, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డీపీవో ధనలక్ష్మీ తదితరులు

కురబలకోట, సెప్టెంబరు 19: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీపీవో ధనలక్ష్మీ, సీఈవో జీవీ రమణారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి పారిశుద్ధ్యం తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎ అనంతరం అధికారులు, విద్యార్థులు స్వచ్ఛ అంగళ్లు కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజ, ఎంపీడీవో హరినారాయణ, పంచాయతి కార్యదర్శి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను పరిశుభ్రంగా ఉంచుదాం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19: స్వచ్ఛత హి సేవా కార్యక్ర మంలో భాగంగా ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు మద నపల్లె పట్టణాన్ని పరిశుభ్రం గా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల చేత మున్సిపల్ కమిషనర్ ప్రమీల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం మూడు అంశాలపై పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు భాగంగా గురువారం గ్రామాలలో పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిజ్ఞ చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:ప్రజలందరి సహకారంతో గ్రామాల్లో సంపూర్ణ స్వచ్ఛత సాధ్యమవుతుందని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలో వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని తద్వారా పర్యావరణ పరిరక్షణలో పాలు పంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల పరిషత్ పరిపాలనా అధికారి రమణ పేర్కొన్నారు. మండలంలోని చొక్కాండ్లపల్లె పంచాయతీలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి జి.రెడ్డిశేఖర్, గోవర్ధన్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో : గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ స్వచ్ఛ భారత్‌లో అందరం భాగస్వాములవుదామని ఎంపీడీవో సురేంద్రనాథ్ పేర్కొన్నారు. స్వచ్ఛతాహే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, సచివాలయ సిబ్బందితో కలసి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అధికారులు, వైద్య సిబ్బంది స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరమణ, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బాలాచంద్రాచారి పాల్గొన్నారు.

మండలంలో తాగునీటి నాణ్యతా పరీక్షలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 19 : స్వచ్ఛతా హీ సేవా కార్య క్రమంలో భాగంగా గురువా రం పెద్దతిప్పసముద్రం మం డలంలోని 20 గ్రామ పం చాయతీల్లో ప్రభుత్వ ఆదేశా నుసారం నీటి నాణ్యతా నిర్వహ ణ పరీక్షలను ఆయా సచివాల య పరిధిలో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది నిర్వ హించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీ టిని అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా నీటి పరీక్షలను నిర్వహించినట్లు ఎంపీడీవో కె.ఎన్. బాలాజీ, మండల ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ హరిలు పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా అందరు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో ముందుకెళ్లాలి



కస్తూరిబా పాఠశాలలో భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19: విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో మందుకెళ్లాల ని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముష్టూరు పంచాయతిలో గల కస్తూరిబా పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సరుకులపై ఆరా తీశారు. అలాగే విద్యార్థినులకు వండిన భోజనం తిని బాగా వండారని కితాబిచ్చారు. కాగా విద్యార్థినుల క్లాస్ రూమ్‌లకు వెళ్లి పలు పాఠ్యాశాలపై అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం హాస్టల్‌కు ప్రహరీ లేదని ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ ఆయన దృషికి తీసుకెళ్లారు దాంతో ఆయన సంబంధిత ఏఈ ద్వారా ఎస్టిమేషన్ వేయించి ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలించిన సబ్‌కలెక్టర్

నిమ్మనపల్లె మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సబ్‌కలెక్టర్ మేఘాస్వరూప్ తనిఖీలు చేపట్టారు. మండలంలోని పది పంచాయతీలలో కలిపి 1141 మంది లబ్ధిదారుల ఫ్రీహోల్డ్ భూముల వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో డీకెటీగా ఉన్న భూములను సెటిల్‌మెంట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అయితే మొదట విడతగా దరఖాస్తుచేసుకొన్న 1141మంది రైతులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ ధనంజేయులును ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్ వీఆర్‌వోలు తదితరుల పాల్గొన్నారు.

అక్రమ గ్రానైట్ క్వారీపై కొరడా ఝులిపించండి

● తంబళ్లపల్లెకు ఇసుక రీచ్‌ను కేటాయించండి
● మంత్రి రవీంద్రను కోరిన టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి



మంత్రి రవీంద్రతో జయచంద్రారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 19: తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నడిచిన అక్రమ గ్రానైట్, కంకర క్వారీలపై కొరడా ఝులిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కోరారు. విజయవాడలోని మంత్రి నివాసంలో గురువారం జయచంద్రారెడ్డి మంత్రిని కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. అక్రమ గ్రానైట్, కంకర క్వారీల విషయమై స్థానిక మైన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వాటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఇసుక రీచ్‌ను 120 నుంచి 130 కిలో మీటర్లు దూరం ఉన్న రాజంపేటలో కేటాయించడంతో భవన నిర్మాణ కార్మికులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తంబళ్లపల్లెలోనే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మద్యం పాలసీని నియోజకవర్గంలో సక్రమంగా అమలయ్యేలా చూడాలని మంత్రి సూచించారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: మదనపల్లె ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఐదు ఫిర్యాదు అందినట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో బెంగళూరుకు సాయంత్రం 6 గంటల పైనా బస్సులు నడపాలని, మదనపల్లె - యర్రగుండ్లబావి సర్వీసుల్లో రెండు ట్రిప్పులు అదనంగా తిప్పాలని కోరారు. అలాగే బెంగళూరుకు అదనంగా రెండు సర్వీసులు పెంచాలని, బి. కొత్తకోట మార్గంలో సాయంత్రం బస్సులు పెంచాలని డిమాండ్ చేశారు. టీసదం మీదుగా చేలూరుకి అదనంగా బస్సు నడపాలని డిమాండ్ చేశారు. రామసముద్రానికి బడి బస్సు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ బెంగళూరుకి త్వరలో కొత్త బస్సులు వస్తాయని రెండు బస్సులు అదనంగా నడుపుతామన్నారు. అలాగే రామసముద్రానికి శుక్రవారం నుంచే బడిబస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యర్రగుండ్లబావికి అదనపు టిప్పులు తిప్పుతామన్నారు.

కొత్తపల్లె దళితవాడకు తీరిన దాహార్తి

కలికిరి, సెప్టెంబర్లు 19: కలికిరి పంచాయతీలోని కె.కొత్తపల్లె దళితవాడలో నెలకొన్న తాగునీటికి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అక్కడ వేసే బోర్లలో నీరు పడకపోవడంతో చాలా కాలంగా గ్రామానికి తాగునీటి ఎద్దడి తీవ్రంగా పరిణమించింది. గ్రామస్థుల విజ్ఞప్తితో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ తీసు కుని దళితవాడకు తాగునీటి సౌకర్యం కల్పించాల ని ఇటీవల ఎంపీడీవో, కలికిరి సర్పంచులను ఆదేశించారు. దీంతో గురువారం టీడీపీ నాయకుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి సర్పంచు యల్లయ్యతో సమన్వయం చేసుకుని బోరు వేయించారు. ఎట్టకేలకు బోరులో సరిపడా నీరు పడటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రామాలయాల్లో వాల్మీకి జయంతి నిర్వహించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: వాల్మీకి జయంతి వేడుకలను అక్టోబరు 17న వాడవాడల సీతారామాలయాల్లో ఘనంగా నిర్వహించాలని ఏపీ వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాల్మీకి సంఘం కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహణకు కార్యచరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలన్నారు. సంపూర్ణ రామాయణాన్ని రచించి శ్రీరాముడి గొప్పతనాన్ని ఔనత్యాన్ని దశ దిశల వ్యాపించేశాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దల జయసింహా, మదనపల్లె అధ్యక్షుడు మంజునాథ్ బొంతల రామకృష్ణ, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు నరసింహులు, కృష్ణమూర్తి, గౌరమ్మ, నిర్మలమ్మ, శ్యామలమ్మ, అర్జున్ మారన్న, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఝరికోన వాటర్ సప్లయ్ కార్మికుల జీతాలు చెల్లించండి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: కేవీపల్లె మండలంలోని ఝరికోన ప్రాజెక్టు వాటర్ సప్లయ్ కార్మికులకు 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కరోనా సమయంలో కూడా కార్మికులు నీటిని సరఫరా చేశారని గుర్తు చేశారు. 40 మంది కార్మికుల జీతాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం శోషనీయమన్నారు. 11 నెలలుగా జీలాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనం నెలకు 21వేల రూపాయలు చెల్లించాలని ఆయన కోరారు.

బి.కొత్తకోట నగరపంచాయతీ కమిషనర్ బదిలీ

బి.కొత్తకోట, సెప్టెంబరు 19: బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ గా పనిచేస్తున్న పీఎస్ మనోహర్ మదనపల్లెకు బదిలీ అయ్యారు. మదనపల్లె మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఆయన రిలీవ్ అయి కొత్త కమిషనర్ వచ్చే వరకు ప్రస్తుతం బి.కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయంలో జూని యర్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమాదేవి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించ నున్నారు.

మందుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

రామసముద్రం, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని మందుల షాపులను మదన పల్లె డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి గురువా రం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసంద ర్భంగా మత్తు మందు కొనుగోళ్లు, అమ్మకా లకు సంబంధించిన రికార్డులు, మత్తు మందుల తయారీ తేదీ, కాలవ్యవధి తేదీ లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల అమ్మకం దారులు మత్తుమందులను ఎంబీబీఎస్ డాక్టర్‌ల సలహాలు సూచనల మేరకే ఇవ్వాలని ఫార్మాసిస్ట్‌లకు సూచించారు. నకిలీ మందులు, కాలం తీరిన మం దులు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అద్దెబస్సుల వారు సమన్వయంతో పని చేయాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు19: ఆర్టీసీ అద్దె బస్సుల వారు సమన్వయంతో పనిచేయాలని వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అనుకాలంగా బస్సు నిలపాలని తెలిపారు. సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. బస్సును కండీషన్‌లో ఉంచి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, అద్దెబస్సులు యాజమానులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలలో వాల్మీకిపురం విద్యార్థుల ప్రతిభ

వాల్మీకిపురం, సెప్టెంబరు 19: వాల్మీకిపురం మండల స్థాయి అథ్లెటిక్ పోటీలలో స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు. అండర్-14, 17బాలబాలికల విభాగంలో మొత్తం 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈపోటీలలో అండర్-17 బాలుర విభాగంలో 100మీటర్ల పరుగు పందెంలో ఉన్నత పాఠశాల విద్యార్థి గిరిధర్ మొదటి స్థానం, అండర్-17 బాలికల విభాగంలో అదే పాఠశాలకు చెంది వైశాలి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా పోటీలలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం సావిత్రమ్మ, పీడీలు ఉషారాణి, రెడ్డివరప్రసాద్, ఉమాదేవి, లలితకుమారి, ధనలక్ష్మి, సబిత, రోషన్‌జమీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


రమాదేవి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: పాము కాటేసి మహిళా రైతు మృతి చెందిన విషాదకరమైన సంఘటన మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లెలో గురువారం జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు... దుబ్బిగానిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి (40) తమ వ్యవసాయ బోరు వద్ద పొలం పనులు చేస్తుండగా కాలిపై పాము కాటేసింది, తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను చికిత్స కోసం 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. దీంతో దుబ్బిగానిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పీలేరులో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పీలేరు, సెప్టెంబరు 19: పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన కృష్ణా నాయక్, అతని భార్య మూడే నీలావతమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఈనెల 18న నీలావతమ్మ తన స్వంత స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన కె.రవి, కె.నాగరత్నమ్మ, వారి కుమార్తె కవిత దారి విషయమై గొడవ పడడమే కాకుండా కులం పేరుతో దూషించారని నీలావతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గొడవ చేయొద్దన్నందుకు దాడి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19: గొడవ చేయవద్దని చెప్పినందుకు దాడి చేసి గాయపరచడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లికి చెందిన శంకర తన ఇంటిని రాజస్తాన్‌కు చెందిన కుటుంబానికి అద్దెకు ఇచ్చాడు. అయితే ఆ కుటుంబసభ్యులు నిత్యం గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో పక్క ఇంటికి చెందిన గంగులప్ప రోజూ గొడవ చేసే రాజస్తాన్ కుటుంబాన్ని ఇల్లు ఖాళీ చేయించవచ్చుకదా అని శంకరను నిలదీశాడు. దీంతో శంకర, తన తండ్రి వెంకటరమణలు గంగులప్పపై దాడి చేసి గాయపరిచారు. దీంతో శంకర, వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

హోంగార్డ్స్ పరేడ్ తనిఖీ


హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19: స్థానిక డీఎస్పీ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో గురువారం హోంగార్డ్స్ పరేడ్‌ను రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేశ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్ పోలీస్ శాఖతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో విధులు పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందుతున్నారని తెలిపారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే సబ్ డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జ్‌కి తెలపాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డులు కొన్ని సమస్యలను కమాండెంట్‌కు విన్నవించగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామని వారికి తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటాచలపతి, మదనపల్లె సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ రమేశ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి


మాట్లాడుతున్న చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: ప్రపంచస్థాయిలో నడవాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలని వైవీయూ వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. యూఎస్‌ఏ, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నత చదువులు, ప్లేస్‌మెంటు అవకాశాలపై గురువారం వైవీయూలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ సమాజం నీకోసం ఎదురు చూస్తుందని విద్యార్థి దశలో జ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ఆంగ్లంలో సంభాషించేవారిని, చదువుతున్న కోర్సుల్లో మార్కుల పరంగా ప్రతిభచూపిన వారికి విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో వ్యవస్థాపకుడు కె.రామారావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పై చదువులకు, పీజీ విద్యార్థులు పరిశోధనలకు, ఉద్యోగావకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారికి ఆర్‌డీఎల్ టెక్నాలజీ సంస్థ ఉచితంగా సహాయపడుతుందన్నారు. విదేశాల్లో టాప్-100 విశ్వవిద్యాలయాల్లో సీటు పొందే విధానం.. అందుకు గల అర్హతలు, పాస్‌పోర్టు పొందే విధానం గురించి అవగాహన కల్పించారు. ప్లేస్‌మెంటు సెల్ డైరెక్టరు ప్రొఫెసరు ఎస్‌వీ రెడ్డి, సైకాలజీ సహాచార్యులు డాక్టర్ లాజర్ పాల్గొన్నారు.

ఏఎఫ్‌ఏయూ సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించి ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ విడుదల చేశారు. గురువారం పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరులో 90 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని.. అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్షల విభాగాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రరెడ్డి, ఉదయ ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 19: మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ బదిలీల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వున్న సీనియర్ అసిస్టెంట్ గంగాదేవి శ్రీకాళహస్తికి బదిలీ కాగా.. ఎర్రగుంట్లలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ గంగిరెడ్డి ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరులో జూనియర్ అకౌంటెంట్‌గా వున్న కె.బాల వెంకటసుబ్రమణ్యం స్వామి, సీనియర్ అకౌంటెంట్ జి.ప్రవీణ్‌కుమార్‌లు మైదుకూరుకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో సీనియర్ అకౌంటెంట్ విజయ్యా జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు కె.విజయ, స్వర్ణలత ఎర్రగుంట్లకు, బి.వెంకట సుబ్బారెడ్డి పులివెందులకు, వి.వెంకట కిరణ్‌కుమార్ జమ్మలమడుగుకు, బి.రామలక్షుమ్మ రాయచోటికి, శ్రీనివాసులరెడ్డి బద్వేల్‌కు, ఎం.రమేష్ పులివెందులకు బదిలీ అయ్యారు. ఎర్రగుంట్ల నుంచి బి.లక్ష్మీనారాయణ, పులివెందుల నుంచి షేక్ షఫివుల్లా, జమ్మలమడుగు నుంచి కె.స్వర్ణలత, బద్వేలు నుంచి హిమబిందు ప్రొద్దుటూరుకు జూనియర్ అసిస్టెంట్లుగా రానున్నారు. అయితే వీరిలో షఫివుల్లాను ప్రొద్దుటూరుకు బదిలీ చేసినా డిప్యూటేషన్‌పై కమలాపురం వేశారు. దీంతో ఇక్కడ ఉన్న ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వెళితే.. ఇక్కడికి ముగ్గురు మాత్రమే జూనియర్ అసిస్టెంట్లుగా బదిలీపై రానున్నారు. అలాగే జూనియర్ అకౌంటెంట్ సుబ్రమణ్యం స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో ఇక్కడ జూనియర్ అకౌంటెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇంత పెద్దమున్సిపాలిటీలో ఒక్క జూనియర్ అకౌంటెంట్ లేని పరిస్థితి నెలకొంది. కేవలం ఒక్క సీనియర్ అకౌంటెంట్‌తో నడపాలంటే కష్టమౌతుందని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కుచించుకుపోయిన కురవంక

- వంకను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు
- వరదొస్తే 500 ఇళ్లు మునకే



కృష్ణానగర్‌లో కురవంకను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 19: మదనపల్లె పట్టణం నడిబొడ్డున ఉన్న కోమటివానిచెరువుకు ప్రధాన నీటి వనరు అయిన కురవంక 100 ప్రాంతాలకు పైగా ఆక్రమణలకు గురైంది. మదనపల్లె పట్టణంలో సుమారు 3 కిలోమీటర్లు ప్రవహించే కురవంక ఇరువైపులా ఇళ్ల స్థలాలకు విపరీతంగా ధరలు ఉండటంతో ఏకంగా వంకను ఆక్రమించేసి పిల్ల కాలువగా మార్చేశారు. ఇదే కురవంకకు వరద వస్తే ఈ వంక పరీవాహక ప్రాంతాల్లో ఇరువైపులా 500 ఇళ్లు వరద నీటిలో మునిగిపోనున్నాయి.

10 అడుగులకు కుచించుకుపోయిన కురవంక

మదనపల్లె మండలం పొన్నేటిపాళెం ఎర్రజేనుచెరువు మొరవ పోతే ఆ వరద నీరు కురవంక ద్వారా మదనపల్లె పట్టణంలోని కోమటివాని చెరువుకు వస్తాయి. ఈ కురవంక పొన్నేటిపాళెం నుంచి ఎగువ కురవంక పంచాయతీ, పట్టణంలోని దిగువ కురవంక ప్రాంతం మీదుగా కృష్ణానగర్, ఇందిరానగర్ మీదుగా కోమటివానిచెరువులో కలుస్తుంది. ఒక్కోచోట ఒక్కో వెడల్పుతో ప్రవహించే కురవంక ఎంత లేదన్నా 60 అడుగుల వెడల్పుతో ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఎగువ కురవంక, దిగువ కురవంక, కృష్ణానగర్, ఇందిరానగర్‌లో కురవంకకు ఇరువైపులా నివాసాలు ఉండటంతో పాటు ఇక్కడ ఇళ్ల స్థలాలు కుంట విస్తీర్ణం ఎంత లేదన్నా రూ.20 లక్షల నుంచి 40 లక్షలు ధరలు పలుకుతున్నాయి. ఈ క్రమంలో కురవంకకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. 60 అడుగుల వెడల్పు ఉండే కురవంక ఆక్రమణలతో పలుచోట్ల 10 అడుగులకు కుచించుకుపోయాయి. కొన్నిచోట్ల కురవంకలో పిల్లర్లు నిర్మించి వాటిపై ఇళ్లను కూడా నిర్మించేశారు.

వరదొస్తే 500 ఇళ్లు మునకే

వర్షాకాలంలో గట్టిగా వరదలు వస్తే కురవంకలో సుమారు 60 క్యూసెక్కుల నీరు ఒక్క ఉదుటన ప్రవహించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే ఆక్రమణలతో వెడల్పు తగ్గిపోయిన కురవంకలో వరద నీరు పారేందుకు అవకాశం ఉండదు.

దీంతో వరద నీరంతా ఇరువైపులా ఉన్న 500 ఇళ్లలోకి ప్రవేశించి, మునిగిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. విజయవాడలో వరదల తాకిడికి వేల ఇళ్లు నీట మునిగి, ఎక్కువగా ఆస్థి, ప్రాణనష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ఆక్రమణలపై దృష్టిపెట్టి తొలగించి, కురవంకకు దారి కల్పించాల్సి ఉంది. ఇటీవల ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కురవంక ఆక్రమణలపై స్వయంగా పరిశీలించి, ఆక్రమించిన వారికి నోటీసులు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ విషయమై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



ఇందిరానగర్‌లో కురవంకను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు - దిగువ కురవంక ప్రాంతంలో కురవంకను మట్టితో పూడ్చివేసిన దృశ్యం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు



మృతి చెందిన సయ్యద్ రహంతుల్లా, గాయపడిన అష్మాద్

వాల్మీకిపురం, సెప్టెంబరు 19: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని తండ్రి మృతి చెందగా కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు పీలేరు పట్టణం సరోజినీదేవివీధికి చెందిన సయ్యద్ రహంతుల్లా (36), అతని కుమారుడు వసీఫ్‌అహ్మద్ (13) ఇద్దరూ కలిసి పీలేరు నుంచి ద్విచక్రవాహనంపై గురువారం హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో వాల్మీకిపురం మండలం విఠలం గ్రామ సమీపానికి రాగానే మదనపల్లె నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఏపీ04బీసీ2342 నెంబరు గల కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సయ్యద్ రహంతుల్లా అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ యువకుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలు తీవ్రం కావడంతో వసీఫ్‌అహ్మాద్‌ను మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. సయ్యద్‌రహంతుల్లా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా కారు రోడ్డుపక్కన పొదల్లోకి దూసుకెళ్లింది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం, పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, సెప్టెంబరు 19: కడప నగరం నాగరాజుపేటలో ఉన్న ఇంటర్ కాలేజ్‌లో చదువుతున్న ఓ ఇంటర్ విద్యార్థి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కడపకు చెందిన యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కాలేజికి వెళ్లిన విద్యార్థి 11.30 గంటలకు కళాశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం వద్దకు వెళ్లి తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు, అధ్యాపకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అయితే విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కడప (క్రైం), సెప్టెంబరు 19 : మద్యం తాగి బైకు నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలుశిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జేఎస్ సీఎం కోర్టు మేజిస్ట్రేట్ మంగళగౌరి తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈనెల 17న కడపకు చెందిన రమేశ్‌రెడ్డి మద్యం తాగి బైకు నడుపుతుండగా తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదుచేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచడంతో న్యాయాధికారి విచారించి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

సామాజిక న్యాయ సాధకుడు చంద్రబాబు

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాదిగ


కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 19: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సామాజిక న్యాయం సాధ్యం కాగలదని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞత తెలిపేలా ఆగస్టు 16న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞతయాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ కులంలోని ప్రధాన మాల, మాదిగలతో పాటు మిగతా ఉప కులాలు కూడా సమాజంలో పురోగతి సాధించేందుకు వీలుగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మన దేశ సామాజిక ఉద్యమాల చరిత్రలోనే గొప్ప తీర్పు అన్నారు. ఈ తీర్పు వెలువడిన వెంటనే అమలు చేస్తామని మాదిగలకు భరోసా ఇచ్చిన దార్శనికుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివకుమార్, నాయకులు కె.బాబు, జి.గురవయ్య, సంజీవ్, వి.నారాయణ, రాములయ్య, జి.శ్రీనివాసులు, సి.నాగార్జున, ఎస్.ఓబులేసు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంబేపల్లె, సెప్టెంబరు19: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లా రాజా (24) అనే వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఎర్రబెల్లి రోడ్డు దేవపట్లకు చెందిన చల్లా రాజా వడ్డెర వృత్తికి చెందిన వ్యక్తి. ప్రతిరోజు పనిలో భాగంగా సమీపంలోని కొండకు వెళ్లి బండ్రాళ్లు కొట్టి ఇంటికి తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రిపేరు రావడంతో రోడ్డు మధ్యలో నిలిపివేసినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు ఆగి ఉన్న బస్సును ఢీకొనడంతో చల్లా రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కొడుకు, భార్య ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

30న హార్సిలీహిల్స్ టోల్‌గేటు వేలం పాట

బి.కొత్తకోట, సెప్టెంబరు 19: బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పైకి వెళ్లే మార్గంలో టోల్‌గేటు వసూలుకు ఈనెల 30వ తేదీ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నారు. ఈ మేరకు హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ నుంచి గురువారం టెండరు ప్రకటన వెలువడింది.. కొండ కింది భాగాన ఉన్న కోటావూరు వద్ద వాహనాలకు రుసుం వసూలు చేస్తారు. ఈ రుసుం వసూలు కోసం ఏడాది కాలపరిమితికి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మదనపల్లెలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోనే వేలం పాట నిర్వహిస్తారు. వేలం పాటలో పాల్గొనే వారు ఈనెల 28వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిని సంప్రదించాల్సి ఉంటుంది.

మైలవరానికి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, సెప్టెంబరు 19: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం ప్రాజెక్టులోకి 7,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.